అయోధ్యలో ఎమ్మెల్యే మల్లారెడ్డి



మేడ్చల్: మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి అయోధ్యకు వెళ్లి రామ మందిరాన్ని సందర్శించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు శంభీపూర్ రాజు తదితరులతో కలిసి ఆయన రామ్‌లల్లాను దర్శనం చేసుకున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవం



గిర్మాపూర్‌లో..

మేడ్చల్: బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మేడ్చల్ మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. మేడ్చల్, అత్వెల్లి, గిర్మాపూర్ తదితర ప్రాంతాల్లో బీజేపీ నాయకులు పార్టీ జెండాను ఆవిష్కరించి పార్టీ సాధించిన విజయాలను వివరించారు. నాయకులు ఆంజనేయులు, ప్రేందాస్, జగన్‌గౌడ్, కౌన్సిలర్ లావణ్య హన్మంత్‌రెడ్డి, రాఘవరెడ్డి, రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంగా జీవించడం ప్రతి ఒక్కరి హక్కు

అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ నీలిమా



ఘట్‌కేసర్: ఆరోగ్యంగా జీవించడం ప్రతి ఒక్కరి హక్కు అని అనురాగ్ యూనివర్సిటీ సీఈఓ నీలిమా అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వెంకటాపూర్ నీలిమా ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన 'నా ఆరోగ్యం.. నా హక్కు' సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏమైనా సాధించవచ్చని, ప్రతి ఒక్కరూ ఆరోగ్య నియమాలు పాటిస్తూ నిత్యం వ్యాయామం చేయాలన్నారు. నీలిమా ఆస్పత్రిలో తక్కువ రుసుముతో కార్పొరేట్ వైద్యం, బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాయితీతో కూడిన మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. నీలిమా ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్(సీఓఓ) నీలిమా, వైద్యులు సురేందర్, గిరిధర్‌రెడ్డి, ప్రతినిధులు మల్లేశ్, భరత్‌రెడ్డి, చెన్నకేశవ పాల్గొన్నారు.

హ్యాకథాన్‌లో విజేతలకు అభినందనలు



హ్యాకథాన్ విజేతలను అభినందిస్తున్న ప్రొఫెసర్లు విష్ణుమూర్తి, విజయకుమార్

ఘట్‌కేసర్: హ్యాకథాన్‌లో విజయం సాధించిన అనురాగ్ యూనివర్సిటీ కంప్యూటర్స్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు ఆ యూనివర్సిటీ క్యాంపస్‌లో శనివారం అభినందన సభ నిర్వహించారు. హైదరాబాద్–ఐఐటీ ఫోర్ట్ పూర్వ విద్యార్థి నిర్వహించిన 'కెరీర్ కార్పొరేట్ ఫెస్ట్'లో అచ్యుత్, అభిలాష్‌రెడ్డి, సందీప్, శ్రావణి, నిఖిల్‌రెడ్డి, సందీప, శ్రావణి, అచ్యుత్, అభిలాష్‌రెడ్డి, అంజలి, ఆదిత్య, బిత్రా మనస్వీర్ టీం విజేతలుగా నిలిచారు. ఈ సందర్భంగా సీఎస్ఈ డీన్ ప్రొఫెసర్ విష్ణుమూర్తి, డీన్ ఎస్ఓఈ ప్రొఫెసర్ విజయకుమార్, నగదు బహుమతులతో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు.

స్విమ్మింగ్ పూల్‌లో బాలుడిని ముంచిన వారిపై కేసు

ఘట్‌కేసర్: స్విమ్మింగ్ పూల్‌లో ఓ మైనర్ బాలుడిని ముంచిన వారిపై ఘట్‌కేసర్ పీఎస్‌లో శనివారం కేసు నమోదైంది. సీఐ సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బీహార్‌కు చెందిన ఓ కుటుంబం ఘట్‌కేసర్‌కు వలస వచ్చారు. వారి కుమారుడు పాఠశాలకు సెలవు ఉన్న రోజుల్లో స్థానిక రాయల్ ఫ్లవర్ షాప్‌లో పని చేసేవాడు. ఫిబ్రవరి నెలలో నాలుగైదు రోజులు షాప్‌లో పనికి రాలేదని షాప్ యజమాని రఫిక్, అతడి స్నేహితుడు ఇంతియాజ్ ఫిబ్రవరి 21న కొండాపూర్‌లోని ఓ స్విమ్మింగ్ పూల్‌కు తీసుకెళ్లారు. నీటిలో ముంచుతూ ఊపిరాడకుండా చేశారు. బాలుడి గొంతుకు తాడు చుట్టి స్విమ్మింగ్ పూల్‌లో ముంచారు. ఈ విషయం ఎక్కడైనా చెబితే చంపుతామని బెదిరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ వెలికి తీసేందుకే 'అజూరా'



విద్యార్థులతో మాట్లాడుతున్న గోపాల్‌రెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు తమలో దాగిఉన్న నైపుణ్యాలను వెలికితీసి నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్‌రెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్‌సెట్‌లో శనివారం అజూరా 2కె24 కార్యక్రమం చేపట్టగా జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల ప్రతిభను వెలికి తీసేందుకు అజూరా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు సాంకేతిక జ్ఞానాన్ని మరింత పెంచుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను తిలకించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, కన్వీనర్ నాగరాజు, ప్రసాద్, దేవదాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్, చిత్రలేఖనం పోటీలు



విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు నాయకుడు

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని కొండాపూర్ విజ్ఞాన్ మహిళా కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఆ కళాశాల విద్యార్థులకు శనివారం క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అప్పారావు నాయకుడు హాజరై బహుమతులు, ప్రశంస పత్రాలు అందజేశారు.

ప్రాణం.. పదిలమేనా..?

అనుమతులు లేని ఆస్పత్రులెన్నో..

- ఆందోళన వ్యక్తం చేస్తున్న ప్రజలు
- వాటిపై వైద్యారోగ్యశాఖ కన్నెర్ర
- 4 ప్రైవేట్ ఆస్పత్రులు, ఒక ల్యాబ్ సీజ్
- మరో క్లినిక్‌కు షోకాజ్ నోటీసు జారీ



గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో నోటీసులు అందజేస్తున్న వైద్యాధికారులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు పదుల సంఖ్యలో ఉన్నాయని భావిస్తున్న వైద్యఆరోగ్య శాఖ వాటిని గుర్తించే పనిలో నిమగ్నమైంది. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనలను పట్టించుకోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలకు సిద్ధవుతోంది. ఇప్పటికే జిల్లాలో ఉప్పల్, కుత్బుల్లాపూర్ ప్రాంతాల్లో నాలుగు ప్రైవేట్ ఆస్పత్రులు(క్లినిక్స్), ఒక ల్యాబ్‌ను సీజ్ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ మరో క్లినిక్‌కు నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ ఆస్పత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్లు, ఫిజియోథెరపీ, డయాగ్నస్టిక్ సెంటర్లు, రిహాబిలిటేషన్ సెంటర్లపై కొరడా ఝులిపించేందుకు వైద్యారోగ్యశాఖ కసరత్తు చేస్తోంది.

వసూళ్లలో ఇష్టారాజ్యం..

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఎలాంటి అనుమతి లేకుండా కొనసాగుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నట్లు తెలుస్తోంది. ఫీజుల వసూళ్లలో మొదలుకొని వైద్య పరీక్షలు తదితర వాటి విషయంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పసిగట్టిన జిల్లా వైద్యారోగ్య ఆస్పత్రుల్లో బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ఫీజులకు సంబంధించిన ధరల పట్టిక జాబితాతో సహా డాక్టర్లు, సిబ్బంది, బెడ్ల సంఖ్య వంటి విషయాలను పొందుపర్చాలని సూచిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది.

అనుమతి ఉన్నవి 1605 ఆస్పత్రులే..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 2,500 పైగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులు ఉన్నాయి. అందులో రిజిస్ట్రేషన్‌తో సహా వివిధ అనుమతితో నడుస్తున్న ఆస్పత్రులు 1605 మాత్రమే ఉన్నాయి. అందులో 100 కంటే ఎక్కువ పడకలు(బెడ్లు) కలిగి ఉన్న ప్రైవేట్ ఆస్పత్రులు 48 ఉన్నాయి. 20 నుంచి 100 పడకలు(బెడ్ల) వరకు ఉన్న ఆస్పత్రులు 317 ఉన్నట్లు వైద్యారోగ్యశాఖ పేర్కొంటోంది. 20 పడకలు (బెడ్లు) ఉన్న ఆస్పత్రులు 294 ఉన్నాయి. అలాగే, పాలీక్లినిక్‌లు, క్లినిక్‌లు, డయాగ్నోస్టిక్ సెంటర్లు 712, డెంటల్ ఆస్పత్రులు 180, ఫిజియోథెరపీ సెంటర్లు 46, రిహాబిలిటేషన్ సెంటర్లు 8, అనుమతి పొందిన స్కానింగ్ సెంటర్లు 628 ఉండగా, ఏ అనుమతి లేని 400 స్కానింగ్ సెంటర్లు ఉన్నట్లు వైద్యారోగ్య శాఖ అంచనా వేస్తోంది.

7 రోజుల్లోనే ఐదు క్లినిక్‌లు సీజ్

తెలంగాణ రాష్ట్ర ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు గతనెల 27న వైద్య బృందం ఉప్పల్‌లోని శ్రీమణికంఠ హెల్త్‌కేర్ అండ్ పాలీ క్లినిక్, చిలుకానగర్‌లోని శ్రీరాజు ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌ను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హత కలిగిన వైద్యులు, సిబ్బంది లేరని గుర్తించి వాటిని సీజ్ చేశారు. అలాగే, సరైన డాక్యుమెంట్స్ లేని చిలుకానగర్ మెసర్స్ మహాలక్ష్మి క్లినిక్‌కు నోటీసు జారీ చేశారు.

- ఈ నెల 3న షాపూర్‌నగర్‌లో ఆర్ఆర్ శ్రీజన్ క్లినిక్, శ్రీవీరభద్ర ఫస్ట్ ఎయిడ్ క్లినిక్, అన్నపూర్ణ ల్యాబ్‌లను తనిఖీ చేసిన వైద్య బృందం అర్హతలేని వైద్యులు, సిబ్బందితో వాటిని నడుపుతున్నారని గుర్తించి, వాటిని సీజ్ చేశారు. గత సంవత్సరంలో ఇదే సీజన్‌లో పీర్జాదిగూడలో ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతున్న ఒక ప్రైవేట్ ఆస్పత్రిని సీజ్ చేసిన వైద్యబృందం స్థానికంగా ఉన్న పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో తనిఖీలు నిర్వహించి మరో 4 ప్రైవేట్ ఆస్పత్రులకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల రిజిస్ట్రేషన్, అనుమతులు తదితర విషయాలపై వైద్యారోగ్యశాఖ ఆరా తీస్తోంది.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించటంతో పాటు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా నడుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులపై చర్యలు తీసుకుంటాం. వాటిని గుర్తించేందుకు వివరాలు సేకరిస్తున్నాం. తనిఖీలు నిర్వహిస్తున్నాం. ప్రైవేట్ ఆస్పత్రిలోని బోర్డుపై డాక్టర్లు, సిబ్బందితో సహా అన్ని వివరాలు, సమాచారం ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

– డా.రఘునాథస్వామి, డీఎంహెచ్ఓ, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా

నకిలీ వైద్యులతో వైద్యం

గోకుల్‌నగర్ గీతా ప్రథమ చికిత్స కేంద్రం సీజ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలోని సైనిక్‌పురి, గోకుల్‌నగర్‌లోని గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో అర్హత లేని నకిలీ వైద్యులు అల్లోపతి వైద్యం చేస్తూ రోగులకు మందులు రాస్తుండటంతో ఆ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రఘునాథస్వామి తెలిపారు. శనివారం గీతా ప్రథమ చికిత్స కేంద్రంలో తనిఖీలు నిర్వహించగా, నకిలీ వైద్యుల విషయం బయటపడిందని తెలిపారు. నేషనల్ మెడికల్ కమిషన్ నిబంధనలు, టీఎస్ఎంసీ చట్టం ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో గీతా ప్రథమ చికిత్స కేంద్రంతో సహా నకిలీ వైద్యులపై ఎఫ్ఆర్ఐ నమోదైందన్నారు. తనిఖీల్లో డీఎంహెచ్ఓ డాక్టర్ టి.రఘునాథస్వామి, మల్కాజిగిరి డివిజన్ డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ ఆనంద్, డాక్టర్లు కపూర్, శ్రీనివాస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీరాములు, పోలీసు అధికారులు ఉన్నారు.



గీతా ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేస్తూ..



ఎంపీటీసీ వ్యవస్థను రద్దు చేయండి



శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం

శామీర్‌పేట్: నిధులు, విధులు లేని మా ఎంపీటీసీ వ్యవస్థను రద్దు చేయాలని శామీర్‌పేట మండలంలోని ఎంపీటీసీ అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎంపీపీ యెల్లుబాయి అధ్యక్షతన శనివారం మండల పరిషత్ మీటింగ్ హాల్‌లో శామీర్‌పేట మండల సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక వసతుల కల్పన విషయంలో సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పరిష్కారం కావడం లేదని, దీంతో ప్రజలకు తమ మోహం చూపించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గ్రామాల్లోని పలు సమస్యలను సభ్యులు, అధికారులు సభా దృష్టికి తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం చర్చించారు. ఎంపీడీఓ మమత బాయి, జెడ్పీటీసీ అనిత, తహసీల్దార్ యాదగిరిరెడ్డి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎండలు మండుతున్నాయ్.. పని వేళలు తగ్గించాలి



నాగారం కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తూ..

కీసర: వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని నాగారం మున్సిపల్ పరిధిలో పారిశుద్ధ్య పనులు చేపట్టే కార్మికుల పనివేళలు తగ్గించాలని కోరుతూ శనివారం నాగారం మున్సిపల్‌కు చెందిన బీజేపీ నేత గంధ్ర కమలాకర్ నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్ర కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ మున్సిపల్ కార్మికులు ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పనులు చేస్తుంటారని, ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో రెండు నెలల పాటు పనివేళలు తగ్గించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. మున్సిపల్ చైర్మన్, పాలకవర్గంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

తాగునీటి సమస్య తలెత్తొద్దు..

జిల్లా ప్రత్యేక అధికారి విజయేంద్ర



సాక్షి, మేడ్చల్ జిల్లా: తాగునీటి సరఫరాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళికా చేపట్టాలని మల్కాజిగిరి జిల్లాకు ప్రత్యేక అధికారి, రాష్ట్ర రవాణా, రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శి విజయేంద్ర సంబంధిత అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ గౌతమ్‌తో కలిసి తాగునీటి సరఫరాపై పురపాలక సంఘాల కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, మిషన్ భగీరథ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు, ఎంపీడీఓలతో శనివారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. తాగునీటి సరఫరా అత్యంత కీలకమైందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని విజయేంద్ర ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. మండల ప్రత్యేక అధికారులతో పాటు తహసీల్దార్లు, ఎంపీడీఓవోలు క్షేత్రస్థాయిలో నీటి సరఫరా తీరును పర్యవేక్షించాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పరం సమన్వయంతో పని చేయాలని సూచించారు.

నీటి కొరత లేదు..: కలెక్టర్ గౌతమ్

జిల్లాలో ఎలాంటి నీటి కొరత లేదని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. వేసవి కాలంలో నీటి వినియోగం పెరిగి తాగునీటి వనరులు తగ్గిపోతాయని, ప్రజావసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా ప్రణాళిక రూపొందించుకుని జిల్లా, మండల, గ్రామస్థాయి అధికారులు ముందుకెళ్లాలన్నారు. ఎక్కడైనా తాగునీటి ఎద్దడి ఏర్పడితే పరిష్కరించడానికి జిల్లా పంచాయతీ కార్యాలయంలోని కాల్ సెంటర్‌లో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్లు, మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, ఎంపీడీవోలు సమన్వయంతో సమష్టిగా పని చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జిల్లా పరిషత్ సీఈఓ దిలీప్ కుమార్, డీపీఓ వెంకటయ్య, డీఆర్డీఏ పీడీ సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్లు, వాటర్ వర్క్స్ అధికారులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగాలి

మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి



ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలో సీఎంఆర్ఐటీ, ఫార్మసీ కళాశాలల వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ టెక్నాలజీ యుగంలో విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాల్లో నిలవాలని కోరారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. కళాశాల డైరెక్టర్ జంగారెడ్డి, ప్రిన్సిపాల్ సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలకు సెలవులివ్వాలి

డీఐఈఓ ఎదుట ఎస్ఎఫ్ఐ ఆందోళన

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఇంటర్ విద్యార్థులకు పరీక్షలు ముగిసిన వెంటనే వేసవి సెలవులు ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు సర్క్యులర్ విడుదల చేసినా నగరంతో సహా శివారుల్లోని కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు సెలవులు ప్రకటించకుండా తరగతులు నిర్వహిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్ విమర్శించారు. శనివారం నగరంలోని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా డీఐఈఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ ఉన్నతాధికారుల సర్క్యులర్‌ను తుంగలో తొక్కి మండుటెండల్లో విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసే విధంగా కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ కళాశాలల యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వేసవి సెలవులు ప్రకటించని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డీఐఈఓ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు వినతి పత్రం అందజేశారు. నిరసనలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అరుణ్, అవినాష్, శ్యామ్‌రావు, మణికంఠ, అనుదీప్, శ్రీమన్, సాయి చరణ్, చింటూ, సాయిరాం, మిట్టు, గిరిధర్, పవన్, రాజేష్, చరణ్ నాయక్, ప్రభుచరణ్, సాత్విక్, అంజి పాల్గొన్నారు.



నీటి సమస్యా..? ఫోన్ చేయండి

జవహర్‌నగర్: జవహర్‌నగర్‌లో నీటి ఎద్దడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేసవికాలం దృష్ట్యా 28వ డివిజన్‌లో నీటి ఎద్దడి రాకుండా ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకున్నామని, నీటి సమస్య ఉంటే టోల్ ఫ్రీ నంబర్: 95024 58449కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

పోచారం పరిధిలో..

పోచారం: వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా పోచారం పురపాలక సంఘ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా తాగునీటి సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నెంబర్ 91548 12774 ఏర్పాటు చేసినట్లు కమిషనర్ వేమనరెడ్డి తెలిపారు. పైప్‌లైన్లు పగలడం, లీకేజీలు, నీటి సరఫరాలో జాప్యం వంటి ఇబ్బందులు ఉంటే ఫోన్ చేయాలని కోరారు.

పెద్దపల్లి కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా మల్లేష్‌గౌడ్



మేడ్చల్: పెద్దపల్లి కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా మేడ్చల్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు రోయ్యపల్లి మల్లేష్‌గౌడ్ నియమితులయ్యారు. పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా పెద్దపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కో ఆర్డినేటర్‌గా ఆయన్ను పీసీసీ నియమించి ఉత్తర్వులు జారీ చేసింది. మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లికి చెందిన ఆయన గతంలో పెద్దపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సభ్యత్వ ఇన్‌చార్జిగా పని చేశారు. ఈ ఎన్నికల్లో పెద్దపల్లి పార్టీ అభ్యర్థి గెలుపునకు కాంగ్రెస్ కార్యకర్తలను సమన్వయం చేసి విజయం సాధిస్తామని ఆయన అన్నారు.

తైబజార్ @ రూ.3.34 లక్షలు



కీసర: కీసర గ్రామ పంచాయతీలో ప్రత్యేక అధికారి బి.నందకిషోర్ అధ్యక్షతన శనివారం తైబజార్ (వారాంతపు సంత) వేలం పాట నిర్వహించారు. వేలంలో అత్యధికంగా రూ.3,34,550లకు చిక్కుడు వెంకటేశ్ పాడుకొని తైబజార్‌ను దక్కించుకున్నారు. పంచాయతీ కార్యదర్శి కె.గంగన్న, వివిధ పార్టీల నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పొందాలి

బోడుప్పల్: మహిళలు టైలరింగ్‌లో శిక్షణ పొంది స్వయం ఉపాధి పొందాలని 21వ డివిజన్ కార్పొరేటర్ భుక్యా సుమన్ నాయక్ అన్నారు. ఈస్ట్ బాలాజీ హిల్స్ కాలనీలో లర్నింగ్ స్పేస్ ఫౌండేషన్ సహకారంతో గత 5 నెలలుగా మహిళలు శిక్షణ పొందగా శనివారం ఆయన చేతుల మీదగా వారికి టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

స్కూళ్లలో వసతులపై ప్రతిపాదనలు పంపండి

కలెక్టర్ గౌతమ్



సాక్షి, మేడ్చల్ జిల్లా: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి ఫైనల్ ఎస్టిమేషన్ నివేదికలు త్వరగా సమర్పించాలని కలెక్టర్ గౌతమ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వీసీ మీటింగ్ హాల్లో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యతో పాటు పలు శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పాఠశాలలను సందర్శించి చేపట్టాల్సిన పనుల ఫైనల్ ఎస్టిమేషన్‌ను రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల పర్యవేక్షణ పనుల వ్యయ అంచనాలను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పాఠశాలలను తనిఖీ చేసి పక్కాగా ప్రతిపాదన రూపొందించాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారానే పూర్తి చేయాలన్నారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులను ప్రభుత్వం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి విజయ కుమారి, డీఆర్డీఏ పీడీ సాంబశివరరావు, మెప్మా అధికారి అనిల్, ఆర్అండ్‌బీ ఈఈ శ్రీనివాస్‌మూర్తి, ఈడబ్ల్యూఐడీసీ, పంచాయతీ రాజ్, ఏఎంఓ రవీంద్ర రాజ్, టీఎస్ఈడబ్ల్యూ ఓడీసీ, డిప్యూటీ ఈఈ బుగ్గయ్య, ఈఈ దుర్గ ప్రసాద్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ జీవితంలో షార్ట్‌కట్స్ ఉండవు

- గూగుల్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజిస్ట్ అభినవ్
- సెయింట్ పీటర్స్‌లో ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్



కార్యక్రమంలో అభినవ్, కళాశాల యాజమాన్యం

మేడ్చల్‌రూరల్: కాలేజీ జీవితం ముగించుకుని కార్పొరేట్ జీవితంలోకి అడుగుపెడుతున్న విద్యార్థులు నిత్యం విద్యార్థిలా కొత్త విషయాలను నేర్చుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని గూగుల్ డిజిటల్ మార్కెటింగ్ స్ట్రాటజిస్ట్ అభినవ్ ర్యాకల అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం ప్లేస్‌మెంట్ సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థి దశలో నేర్చుకున్నవి ఉద్యోగంలో ఉపయోగించాల్సి ఉంటుందని, ఉద్యోగపరంగా ఎదురయ్యే సవాళ్లను అధిగమించాలన్నారు. కార్పొరేట్ జీవితంలో షార్ట్‌కట్స్ ఉండవని చేసే ఉద్యోగంలో రాణించాలని కోరారు. టీం వర్క్ ద్వారా చాలా విషయాలపై అవగాహన సాధించవచ్చన్నారు. అనంతరం కళాశాల సెక్రటరీ టీవీ రెడ్డి మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరంలో 700లకు పైగా విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ బాలారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీలత, జీపీసీ డిజిటల్ సంస్థ హెచ్ఆర్ మేనేజర్ సుధా, ప్లేస్‌మెంట్ అధికారి శ్రీకాంత్, డైరెక్టర్లు అనురాగ్‌రెడ్డి, సరోజారెడ్డి, టీపీఓ శ్రీకాంత్, పీఆర్వో రవిసుధాకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్తింటి ముందు కోడలి ఆందోళన



ఘట్‌కేసర్: అదనపు కట్నం కోసం ఇంట్లోకి రానీయకపోవడంతో అత్తారింటి ముందు ఓ యువతి శనివారం ఆందోళన చేపట్టింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్ రైల్వేగేటు సమీపంలో నివసించే రామిడి ప్రతాపరెడ్డి, బుచ్చమ్మ కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డితో యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన సురకంటి భూపాల్‌రెడ్డి బాలమణి కూతురు రాధికతో 2020లో వివాహం జరిగింది. 40 తులాల బంగారం, కిలో వెండి, రూ.10 లక్షలు, అర ఎకరం భూమిని కట్నంగా అందజేశారు. పెళ్లయిన నెల రోజుల నుంచే భర్త విష్ణువర్ధన్‌రెడ్డి ఆమెను కొడుతూ దూషిస్తున్నాడు. మొదటి సారి అబార్షన్ చేయించాడు. రెండోసారి కూడా అబార్షన్ చేయించుకోవాలని చెప్పగా ఆమె నిరాకరించడంతో ఓ కూతురుకు జన్మనిచ్చింది.

మరో వివాహం చేయాలని..

నాలుగెకరాల భూమి, అదనపు కట్నం తేవాలని ఏడాదిగా వేధిస్తూ ఇంట్లోకి రానీయడం లేదని ఆమె తెలిపింది. హైటెక్ సిటీలో ఉంటూ బెంగళూరులో ఉన్నానంటూ ఇంటికి రావడం లేదని, కూతురుతో కలిసి ఇంట్లోనే ఉంటానని అత్తారింటి ముందు వంటా వార్పు చేపట్టింది. బావ కానిస్టేబుల్ ప్రశాంత్‌రెడ్డి, తోటి కోడలు శైలజ, ఆడపడుచు జిల్లెల భగిత అలియాస్ సోని, ఆమె భర్త జిల్లెల రంగారెడ్డి తన భర్తకు వేరే యువతితో పెళ్లి చేయాలని ప్రయత్నిస్తున్నారని, తనను అంతమొందించాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించింది. ఈ విషయమై పోలీసులతో మాట్లాడేందుకు కూడా ఆమె నిరాకరించిది.